క్లుప్తంగా

పట్టణంలో ఎన్నికల ప్రచారం


ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

పాయకరావుపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపు కోసం పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ ఆధ్వర్యంలో పట్టణంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఉపాధ్యాయ సంక్షేమం కోసం శ్రీనివాసులు నాయుడు చేసిన కృషిని వివరించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఎ.ప్రకాష్, ప్రధాన కార్యదర్శులు పి.హరికృష్ణ, నాయకులు మహేష్, వీరభద్రరావు, బుద్ధా సత్యనారాయణ, టి.సత్యనారాయణ, క్రాంతి కుమార్, ఖాజీ బాబు, సత్య శ్రీనివాస్, నాగేశ్వరరావు, కాలెపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ తనిఖీలు


డ్రోన్‌తో పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

పాయకరావుపేట: పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పలు కాలనీలను డ్రోన్‌తో పరిశీలించామని సీఐ జి.అప్పన్న తెలిపారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కొండ పక్కన దుర్గానగర్, రాజీవ్ నగర్, దుర్గాకాలనీ, అంబేడ్కర్ కాలనీ, ఇందిరా కాలనీల్లో అసాంఘిక కార్యకలాపాలను పరిశీలించడం కోసం డ్రోన్ ఉపయోగించామన్నారు.

అచ్యుతాపురంలో బీజేపీ సంబరాలు


మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ శ్రేణులు

అచ్యుతాపురం: ఢిల్లీలో బీజేపీ గెలుపొందటంతో ఆ పార్టీశ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఈ మేరకు శనివారం అచ్యుతాపురం బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు నాయుడు బాబు ఆధ్వర్యంలో ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకొని సందడి చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, మేరుగు కాసుబాబు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జేవీఎస్ రాజు, మత్స్యకార సంఘం నాయకులు ఒరుపుల జయశంకర్, జనరల్ సెక్రటరీ బండారు నాయుడు, శీరా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైయర్ అందజేత


వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ మంచి విద్యనభ్యసించాలని పూర్వ విద్యార్థులు మత్తి కార్తీక్, శ్రీధర్ తెలిపారు. గోకులపాడు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సురక్షితమైన తాగునీరు తాగాలని ఉద్దేశంతో రూ.20 వేలు విలువ చేసే వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మాలెం రమణబాబు, నక్కా శ్రీనివాసరావు, మాలెం చిన్నరాజు, పిల్లి నాగేశ్వరరావు, గొర్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పూడిమడకకు 3 పారిశుధ్య వాహనాలు


పారిశుధ్య వాహనాలతో ఎంపీటీసీ

అచ్యుతాపురం: సెజ్ పరిధిలోని సెయింట్ గోబస్ కంపెనీ సామాజిక బాధ్యతలో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు పారిశుధ్య వాహనాలను సమకూర్చింది. దీనిలో భాగంగా పూడిమడక గ్రామానికి మూడు పారిశుధ్య వాహనాలను అందించింది. ఈ మేరకు ఎంపీటీసీ లక్ష్మీకాంతం సదరు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే సుందరపు కోరగా, ఆయా కంపెనీల ద్వారా సామాజిక అవసరాలు తీరుస్తున్నారని ఆమె తెలిపారు.

మధ్యే మార్గంగా..

- కీలకంగా మారనున్న కొండకర్ల-నర్సింగబిల్లి రహదారి
- అచ్యుతాపురం సెజ్ నుంచి హైవేకు ప్రత్యామ్నాయంగా గుర్తింపు
- విస్తరణ కోసం ప్రతిపాదనలకు కసరత్తు



అచ్యుతాపురం: రవాణా సౌకర్యం మెరుగ్గా ఉన్న చోట ప్రగతి పరుగులు తీస్తుంది. ప్రయాణాలు, వస్తు రవాణా సానుకూలంగా ఉంటుంది. అచ్యుతాపురం సెజ్ పుణ్యమా అని ఈ ప్రాంత రూపురేఖలు మారుతోంది. ఈ సెజ్‌కు రవాణా సౌకర్యం కల్పించేందుకు ఎటు చూసినా విశాఖ-రాజమండ్రి హైవేకు అనుసంధానం చేయాల్సిందే. కానీ కోట్లాది రూపాయిల ముడిసరుకుల రవాణా, పెరిగిన ట్రాఫిక్ రద్దీ నివారణకు అందుబాటులో ఉన్న రహదారుల్ని విస్తరించలేని దుస్థితిలో ఆ శాఖ అధికా ఉన్నారు. సెజ్ నుంచి పరవాడ వైపు ఉన్న ఒక మార్గం, యలమంచిలి మార్గాలు ఇప్పటికే ప్రత్యేక నియంత్రణలో ఉన్నాయి. కీలకమైన రహదారిగా మారిన అచ్యుతాపురం-అనకాపల్లి రహదారి విస్తరణ కోసం సిగపట్లు పడుతున్నారు. ఈ క్రమంలో మరో ప్రత్యామ్నాయ మార్గం కొండకర్ల-నర్సింగబిల్లిపై కూడా అందరి దృష్టి పడింది.

సింగిల్ లైన్‌తో అవస్థలు...

కొండకర్ల నుంచి నర్సింగబిల్లికి 12 కిలోమీటర్ల దూరం ఉంది. కొండకర్ల నుంచి హైవేకు అనుసంధానం చేసే రహదారిని విస్తరించాలనే ప్రతిపాదన ఉంది. రెండు సంవత్సరాల క్రితం వేసిన ఈ రహదారి గోతుల పూడ్చివేత జాబితాలో లేదు. మరో వైపు సింగిల్ లైన్ కావడం, ఎన్నో మలుపులు ఉండటంతో కచ్చితంగా విస్తరించాల్సిన ఆవశ్యకత ఉంది. ఇటీవల కాలంలో ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. కొండకర్ల జంక్షన్, ఎర్రవరం, ఉప్పవరం, మల్లవరం, ఎం.జగన్నాథపురం, చూచుకొండ, గణపర్తి, సోమవరం, నర్సింగబిల్లి గ్రామాలను కలిపే ఈ రహదారికి మూడు మండలాల సరిహద్దులు, రెండు నియోజకవర్గాలతో సంబంధం ఉంది.

శిథిలమైన కల్వర్టులతో పొంచి ఉన్న ప్రమాదం

భవిష్యత్‌లో కీలక అనుసంధాన మార్గంగా మారబోతున్న ఈ రహదారిలో చాలా చోట్ల కల్వర్టులు శిథిలమయ్యాయి. ఏ మాత్రం ఆదమరిచినా అంతే సంగతులు. మరోవైపు మునగపాక మండలంలోని చూచుకొండ-గణపర్తి మధ్య రోలుగెడ్డ వంతెన నీటి ప్రవాహ సమయంలో మునిగిపోయే సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో ఈ బ్రిడ్జి ఎత్తును పెంచాల్సి ఉంది. ఇవన్నీ ఆర్అండ్‌బీ శాఖకు సవాలుగా మారనున్నాయి.


శిథిలమైన కల్వర్టు

జంగిల్ క్లియరెన్స్ లేక ఇక్కట్లు...

సింగిల్ లైన్ కావడంతో చాలా నెలల నుంచి ఈ మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయలేదు. ప్రతిపాదనలు ఉన్న సరైన నిధులు లేక ఆ శాఖ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా సంక్రాంతి నాటికి గోతుల్ని పూడుస్తామని హామీలు గుప్పించడంతో ఆర్అండ్‌బీ దృష్టి అంతా గోతుల పూడ్చివేతపై పడింది. దీంతో జంగిల్ క్లియరెన్స్ కోసం ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు. అంతే కాకుండా సాధ్యమైనంత త్వరలోనే విస్తరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

విస్తరణ ప్రతిపాదనలు

కొండకర్ల-నర్సింగబిల్లి రహదారిని డబుల్ లైన్ రోడ్డుగా విస్తరించాల్సిన ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రస్తుతానికి జంగిల్ క్లియరెన్స్ చేయాల్సి ఉంది. కొన్ని చోట్ల కల్వర్టులు శిథిలమయ్యాయి. భవిష్యత్‌లో ఈ మార్గం మరింత కీలకంగా మారనుంది.

– పద్మిని, జేఈ, ఆర్అండ్‌బీ శాఖ

మై హోం ఉద్యోగులకు హృద్రోగ పరీక్షలు


ఉద్యోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లి మైహోం ఇండస్ట్రీస్ ఉద్యోగులు, కార్మికులకు శ్రీనగర్ కాలనీలో శనివారం హృద్రోగ పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం వెంకటేశ్వర వాస్కులర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వివిధ రకాల హృద్రోగ పరీక్షలు నిర్వహించారు. మంచి పోషకాహారాన్ని తీసుకోవడం, దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవడంతోపాటు 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికొకసారి క్రమం తప్పకుండా హృద్రోగ పరీక్షలు చేయించుకోవాలని హృద్రోగ నిపుణుడు డాక్టర్ ఎల్ హర్షవర్ధన్ సూచించారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం(ఆపరేషన్స్) బీ రామస్వామి, వైద్యులు ఎల్ వర్షిని, ఎల్ జగన్నాథరావు, చంద్రశేఖర్, సీనియర్ డీజీఎం(పీ అండ్ ఏ) ఎల్ శ్రీనివాసరావు, ఓహెచ్‌సీ సీనియర్ ఆఫీసర్ బీ రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం: మండలంలోని చిప్పాడ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఆపరేషన్స్) రాజశేఖర్ తెలిపారు. పూడిమడక, చిప్పాడ, కొండపాలెం, కడపాలెం, పెద్దూరు, జాలరిపాలెం, పల్లిపేట, ఎస్సీ కాలనీ పరిధిలో ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేడుకగా భీష్మ ఏకాదశి

ఉపమాకకు పోటెత్తిన భక్తులు


స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


వెంకన్న స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


వమ్మవరం గ్రామంలో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు

నక్కపల్లి: భీష్మ ఏకాదశి పురస్కరించుకుని శనివారం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఇక్కడ ఉదయం గరుడాద్రిపై వెలసిన స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం కొండ దిగువన ఉత్సవమూర్తులకు, ఆండాళ్లమ్మవారికి, ఉపాలయాల్లోను విశేష పూజలు చేశారు. అర్చక స్వాములు శేషాచార్యులు భక్తులకు గోత్రనామాలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. బంధుర సరస్సుకు అభిముఖంగా ఉన్న లక్ష్మణేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.

ఎస్.రాయవరం: భీష్మ ఏకాదశి సందర్భంగా వమ్మవరంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఎంపీటీసీ బాలం సూరిబాబు దంపతులతో ఈ వేడుక చేయించారు. సర్పంచ్ పాలపర్తి పాపారావు, యువకులు స్వామి ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. రేవుపోలవరం గ్రామంలో లక్ష్మీమాధవస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.

పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు

మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజును కలిసిన అనుబంధ విభాగాల అధ్యక్షులు


మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

మునగపాక: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీకి పేరు తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలోని పలు అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియమితులైన పార్టీ నేతలు శనివారం రమణమూర్తిరాజును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని వమ్ముచేయకుండా పార్టీ కోసం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు బొడ్డేడ చెల్లయ్యనాయుడు, పోలవరపు రమణప్రసాద్, మందా రాము, పిట్టా మంగారెడ్డి, సుందరపు తాతాజీ, చదరం అప్పలనాయుడు, పల్లెల ప్రకాశరావు, మళ్ల బాపునాయుడు, చేకూరి రామరాజు, పార్టీ నేతలు బొద్దపు శ్రీరామమూర్తి, బొడ్డేడ బుజ్జి, సంతోష్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాల తులసీ ఆలయం ప్రారంభోత్సవం

హాజరైన మాజీ మంత్రి గుడివాడ, పార్టీ నేత బొడ్డేడ


ఆలయాన్ని దర్శించుకుంటున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


కోలాటం కళాకారులను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు నాగేశ్వరరావు-నాగమణి దంపతులు

మునగపాక: మండలంలోని మడకపాలెంలో నూతనంగా నిర్మించిన బాల తులసీమాంబ ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు రాయి నాగేశ్వరరావు, నాగమణి దంపతుల ఆర్థిక సహకారంతో నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవానికి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు ఇతర గ్రామాల భక్తులు భారీగా హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో భాగంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కోలాటం కళాకారులను ఆలయ ధర్మకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భీముని వెంకటేశ్వరరావు, కొండకర్ల శివ, నాగేశ్వరరావు, గుంట్ల అప్పారావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామనామ స్మరణతో మార్మోగిన తిమ్మరాజుపేట

ఘనంగా రామాలయ ప్రారంభం


సీతారాముల వారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


సీతారాముల పూజలో పాల్గొన్న భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. రామ నామస్మరణతో తిమ్మరాజుపేట మార్మోగింది. వేద పండితులు వెలవెలపల్లి కోటేశ్వరశర్మ మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, మాజీ సర్పంచ్‌లు శరగడం జగన్నాథరావు, సూరిశెట్టి రాము, పెద్దలు భీమరశెట్టి శ్రీనివాసరావు, మళ్ల స్వామితో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలి వచ్చారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి వారు


కల్యాణమహోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోటవురట్ల: మండలంలోని సాయినగర్‌లో వేంచేసిన పద్మావతి అలిమేలు మంగ సహిత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా జరిపారు. సమీప గ్రామాల నుంచి హాజరైన భక్తులు స్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. డి.సీతారామరాజు దంపతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల కలయిక

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు వెలగా సురేష్‌కుమార్, ఏవీఎస్ మూర్తి, పెంటకోట గిరిబాబు తెలిపారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివిన 1986–87 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

కోటవురట్ల: శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని హెచ్‌ఎం ఎం.లక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ప్రత్యేక తరగతి నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల సాధన కోసం అదనపు తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సులభరీతిలో అర్థమయ్యేలా బోధన చేస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాలు ఆడుతున్న వారిపై పోలీసుల దాడులు

గొలుగొండ: శనివారం ఏటిగైరంపేట పంచాయతీ శివారు ముంగర్లపాలెం వద్ద కోడి పందాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేసి నలుగురు వ్యక్తులు, రెండు కోడి పుంజులను పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు. గ్రామాల్లో పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మంగళాపురంలో..

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో శనివారం తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కోడి పందాలు, గుల్లాటలపై వచ్చిన సమాచారంతో బుచ్చెయ్యపేట ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బందితో దాడి చేశారు. రెండు కోడి పుంజులు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 1,600 నగదు, గుల్లాట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుండి రూ.1,400 నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి హామీ

మాకవరపాలెం: మండలంలో ఉన్న ఆన్‌రాక్ (పయినీర్) అల్యూమినియం రిఫైనరీకి అధిక లోడుతో బాక్సైట్ ముడి ఖనిజాన్ని తరలిస్తున్న లారీల కారణంగా రోడ్లు పాడవడం, ప్రమాదాలు జరుగుతున్నాయంటూ శెట్టిపాలెం, భీమబోయినపాలెం, జడ్.గంగవరం సర్పంచ్‌లు అల్లు రామునాయుడు, రుత్తల నందకిషోర్, దుంగల వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ నెల 5న స్థానికులు 120 లారీలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. గత నాలుగు రోజులుగా ఈ నిరసన కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు పయినీర్ ట్రాన్స్‌పోర్ట్, లారీ అసోసియేషన్ ప్రతినిధులు ఇప్పటికే సర్పంచ్‌లతో చర్చలు జరపడంతో పలు డిమాండ్లను వారి ముందుంచారు. మొదటి డిమాండ్ అయిన రోడ్డు విస్తరణకు సంబంధించి వెంకన్నసపాలెం నుంచి కంపెనీ వరకు రోడ్డుకు ఇరువైపులా విస్తరణ పనులను యాజమాన్యం ప్రారంభించింది. ఈ మేరకు శనివారం పయినీర్ యాజమాన్యం, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారులు సంయుక్తంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా నిబంధనల మేరకు లారీలను నడుపుతామని, మిగిలిన డిమాండ్లను కూడా పరిష్కరిస్తామని నిరసనకారులకు హామీ ఇవ్వడంతో లారీలను విడిచిపెట్టారు. 15 రోజుల్లోగా తమ డిమాండ్లను పరిష్కరించకుంటే మరలా లారీలను అడ్డుకుంటామని నిరసనకారులు స్పష్టం చేశారు. డిమాండ్లతో కూడిన పత్రాన్ని యాజమాన్య ప్రతినిధులకు అందజేశారు.